సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
90324 97123
నంబర్‌ను సంప్రదించండి

మెరుగుపడని బతుకులు

రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివి. ఎండనకా.. వాననకా పొద్దస్తమానం కష్టపడితే చేతికొచ్చేది కొద్ది మొత్తమే. దాంతోనే కుటుంబాన్ని పోషించుకోవాల్సిన పరిస్థితి. ఇత్తడికి మెరుగులద్దే వారి జీవితాలు మాత్రం మెరుగుపడటం లేదని కార్మికులు వాపోతున్నారు.. వీరికి ప్రభుత్వం నుంచి అందే సాయం అంతంత మాత్రమే. హామీ ఉంటే గానీ బ్యాంకులు లోన్‌లు ఇవ్వని పరిస్థితి. తమ బతుకులింతే అంటూ జీవనం కొనసాగిస్తున్నారు.

- ఆర్థిక ఇబ్బందుల్లో ఇత్తడి పాలిష్ కార్మికులు
- రెక్కాడితే గాని డొక్కాడని వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి


ఇత్తడి సామగ్రికి మెరుగు పెడుతున్న కార్మికుడు


అల్లిపురంలో దుకాణం నడుపుతున్న రవి

అల్లిపురం: నగరంలో ఇత్తడి మెరుగు పెట్టే కార్మికులు దుర్భరమైన జీవనాన్ని సాగిస్తున్నారు. అల్లిపురంలో మాత్రమే చిన్నచిన్న దుకాణాలు పెట్టుకుని చాలా మంది బతుకు బండి ఈడుస్తున్నారు. రోజంతా కష్టపడితే రూ.150 నుంచి రూ.200 గిట్టుబాటు కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటితో ముడిసరుకులు కొనుక్కుని, రోజువారి ఫైనాన్స్‌లు కట్టుకుని, కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. పెరిగిన ధరలతో.. వచ్చే మొత్తంతో కుటుంబాలను నెట్టుకురావటం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలంలో ఇత్తడి వస్తువులకు గిరాకీ తక్కువగానే ఉంది. పాత వాటిని రిపేరు చేయించుకునే వారు మాత్రమే అడపా దడపా దుకాణాలకు వస్తుంటారు. చిన్నచిన్న రిపేర్లు వస్తే కాస్తంత డబ్బులు వస్తుంటాయని వారు తెలిపారు. బ్యాంకులు తగిన హామీ పెట్టకపోతే రుణాలు మంజూరు చేయడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఇత్తడి మెరుగు పెట్టే కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. తమలాంటి పేదలకు ఇళ్ల కేటాయించాలని కోరుతున్నారు.

హామీ లేని రుణాలు ఇప్పించాలి



ప్రభుత్వం ద్వారా వ్యాపారం చేసుకునేందుకు హామీ లేని రుణాలు ఇప్పించాలి. ఎటువంటి ఆధారం లేని మాకు హామీలు ఎవరిస్తారు. చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుంటే వాటికి అద్దె కట్టడం కష్టంగా ఉంది. ఇలాగైతే మాలాంటి వాళ్ల బతకడమెలాగో తెలియడం లేదు.

– గెద్దం భాస్కరరావు, ఇత్తడి మెరుగు కార్మికుడు, యాతపేట

పూట గడవక ఇబ్బంది పడుతున్నాం



రోజంతా కష్టపడినా పూట గడవడం కష్టంగా ఉంది. దీంతో అప్పులు చేసుకోవాల్సి వస్తోంది. వచ్చిన దాంట్లో అప్పులకు సగం, ఇంటి ఖర్చులకు మరో సగం పోతోంది. ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, ఇతర ఖర్చులతో ఇబ్బందులు పడుతున్నాం. పనిలేక చాలా కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

– రవి, ఇత్తడి మెరుగు పెట్టే కార్మికుడు, అల్లిపురం

అనఘాదేవికి ప్రత్యేక పూజలు


పేదలకు గొడుగులు, విసనకర్రలు, పాదరక్షలు దానం చేస్తున్న భక్తులు


విశేష అలంకరణలో అనఘాదేవి

అల్లిపురం: వైశాఖ శుద్ధ తృతీయ సందర్భంగా అల్లిపురంలోని వివేకానందకాలనీలో గల షర్డీ సాయి మందిరంలో ఆదివారం ఘనంగా పూజలు నిర్వహించారు. దేవాలయం ఆవరణలో గల అనఘాదేవి అమ్మవారికి ఉదయం నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజల నేపథ్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. కుబేర, లక్ష్మీ పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు పేదలకు విసనకర్రలు, గొడుగులు, వస్త్రాలు, అన్నదానం, చెరుకురసం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

విష్ణు సహస్రనామ పారాయణతో విశ్వశాంతి


ఆకొండి సూర్యనారాయణశాస్త్రిని సత్కరిస్తున్న సభ్యులు

డాబాగార్డెన్స్: పాతనగరం ఉడ్‌యార్డ్ స్ట్రీట్‌లో గల శ్రీవాసవీ కల్యాణ మండపంలో ఆదివారం విష్ణు సహస్రనామ సంకీర్తన సత్సంగం 25వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఆకొండి సూర్యనారాయణశాస్త్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విష్ణు సహస్రనామ సంకీర్తన సత్సంగం (నేవల్ డాక్‌యార్డ్) సభ్యులచే విష్ణు పారాయణ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆధ్యాత్మిక సభలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ పాల్గొని మాట్లాడారు. విష్ణు సహస్ర నామంతో విశ్వశాంతి కలుగుతుందని, సమస్త కర్మలు తొలగి దైవానుగ్రహం, మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. గత 25 ఏళ్లుగా ప్రతి రోజూ నిర్విరామంగా విష్ణు సహస్రనామ పారాయణ చేస్తున్న సంకీర్తన సత్సంగ సభ్యులను అభినందించారు. అనంతరం సత్సంగం వ్యవస్థాపకుడు ఆకొండి సూర్యనారాయణ శాస్త్రిని సత్కరించారు. కార్యక్రమంలో పీఎస్‌వీ శ్రీనివాస్, ఎం. సతీష్, ఎం. వెంకట్రావు, రమేష్‌చంద్ర, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఎమ్మెల్యే వాసుపల్లి


ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సింహాద్రి నాథుని చందనోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కుటుంబ సభ్యులతో స్వామి వారిని దర్శించుకున్నారు.

డాబాగార్డెన్స్

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జ్ఞానాపురం రైల్వేస్టేషన్ రహదారిలో భీమేశ్వర ఆటో, ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ పాల్గొని ప్రారంభించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఆటో, టాక్సీ డ్రైవర్లకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధుబాబు, వి.వేళంగిణీరావు, శ్యామ్‌సుందర్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత బాలునికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న సన్యాసిరావు

డాబాగార్డెన్స్: బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో నగరంలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిదేళ్ల బాలుడు సారిక కృష్ణకుమార్‌కు మొర్ర చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొర్రా సన్యాసిరావు ఆదివారం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సన్యాసిరావు భార్య అనూషరాణి, నీలాపు సర్వేశ్వర రెడ్డి, అజయ్‌రెడ్డి, మాదాబత్తుల రమేష్, సారిపల్లి సంతోష్, కమలాకర్‌రెడ్డి, గోవింద్, మధు, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నప్రసాదం వితరణ చేస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: చందనోత్సవం సందర్భంగా అప్పన్న నిజరూప దర్శనానికి వచ్చే భక్తులకు గోపాలపట్నం పరిధిలో లైన్ వ్యాపారం చేసే వర్తకులు ఆదివారం గోశాల వద్ద మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ప్రారంభించి భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. సుమారు 5000 మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో వర్తక సంక్షేమ సేవా సంఘం సభ్యులు బి. గంగాధరం, పి. దామోదరం, పి. గోవిందరాజు, అప్పారావు, ఎన్‌కే ప్రసాద్, గుప్త తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ప్రారంభించి, భక్తులు, పాదచారులకు మజ్జిగ అందజేశారు. పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైశాఖ శుద్ధ తదియ నుంచి అమావాస్య వరకు ప్రతి రోజూ చల్లని మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.

బహిరంగ సభకు తరలిరండి


సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఈ నెల 26న కూర్మన్నపాలెం జంక్షన్‌లో నిర్వహించనున్న బహిరంగ సభకు వేలాదిగా తరలి రావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె. లోకనాథం పిలుపునిచ్చారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సీపీఎం కార్యకర్తల విస్తృత సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి బి. జగన్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న లోకనాథం మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కొత్తగా ఒక్క పరిశ్రమ కూడా పెట్టలేదని, కానీ ఆంధ్ర రాష్ట్రానికి ఏకైక భారీ పరిశ్రమ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తానని పదేపదే ప్రకటనలు చేయడం సరి కాదన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకాన్ని అడ్డుకోవాలంటే అఖిలపక్ష నాయకులను మోదీ దగ్గరకు తీసుకెళ్లే ఏర్పాటు చేయాలన్నారు. మరోవైపు స్టీల్‌ప్లాంట్‌పై బీజేపీ చేస్తున్న ప్రకటనలపై వైఎస్సార్ సీపీ, తెలుగుదేశం, జనసేన పార్టీలు మాట్లాడకపోవడం దారుణమన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహించనున్న బహిరంగ సభకు పెద్ద ఎత్తున ప్రజలు, కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎం. జగ్గునాయుడు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎం. సుబ్బారావు, పైడిరాజు, యూఎస్ఎన్ రాజు, వి. నరేంద్రకుమార్, బి. వెంకట్రావు, ఎం. రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా జగనన్నే మా భవిష్యత్తు


లబ్ధిదారుకు సంక్షేమ ప్రగతిని వివరిస్తున్న బొడ్డేటి కిషోర్ తదితరులు

అల్లిపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 32వ వార్డు పరిధి దేవాంగులవీధిలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్ బొడ్డేటి కిషోర్, గృహసారథులు ఉగ్గిన భవాని, రెల్లి మహేష్, వలంటీర్ హేమ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని తెలిపారు.

పౌరహక్కుల నేతకు నివాళులు


ఆచార్య సుబ్బారావుకు నివాళులర్పిస్తున్న పౌర హక్కుల సంఘం నేతలు

అల్లిపురం: పౌరహక్కుల నేత సుబ్బారావు సంస్మరణ సభ ఆదివారం సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. రాష్ట్ర పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ ఆంత్రోపాలజీ ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, పౌరహక్కుల సంఘం కార్యదర్శి చంద్రశేఖర్, పీవోడబ్ల్యు అధ్యక్షురాలు ఎం.లక్ష్మి, సీపీఐ జిల్లా అధ్యక్షుడు ఎం.పైడిరాజు పాల్గొని సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ మాట్లాడుతూ ఆదివాసీలపై జరుగుతున్న దాడిని వివరించారు. పీవోడబ్ల్యు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వాలు ఆదివాసీలకు ఎలాంటి అండదండలు కల్పించడం లేదన్నారు. ఆచార్య సుబ్బారావు లేక పోవడం పౌర హక్కుల ఉద్యమానికి తీరని లోటని వక్తలు సంతాపం తెలిపారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి


చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

డాబాగార్డెన్స్: ఎంటీఆర్ సినీ సాంగ్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకుడు ఎం. త్రినాథరావు నేతృత్వంలో ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయకులు ఎం. త్రినాథరావు, జ్యోతి, ఎమ్మెస్ మాధవ్, అంబిక, ఎస్ఎస్ఎన్ రాజు, నాగలక్ష్మి, డాక్టర్ కేఎల్ రావు, లయ, నిహారిక, ఎన్. రాజేశ్వరి పలు చిత్ర గీతాలు శ్రావ్యంగా పాడి ప్రేక్షకుల్ని అకట్టుకున్నారు. కార్యక్రమంలో విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సుందర్‌వడ్డీ, సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు సన్‌మూర్తి, ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు, న్యాయవాది బర్ల పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యుల నూతన కార్యవర్గం

మహారాణిపేట : ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజిషియన్ వైద్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పి.బి.కె. సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.చంద్రశేఖర్ రావుల సమక్షంలో 2023–25 సంవత్సరాలకు గాను ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా డాక్టర్ పి.రాఘవేంద్రరావు, కార్యదర్శిగా డాక్టర్ రాజా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ ఎం.శివకాంతి, నిరంతరం వైద్య విద్యల కన్వీనర్‌గా డాక్టర్ వి.హేమలత, కోశాధికారిగా డాక్టర్ ఎస్. సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ ఆర్. నర్మదా మానస, డాక్టర్ వి.లక్ష్మీపతిరాజు, డాక్టర్ హెచ్.చాందినీశ్రీ,, డాక్టర్ బి.వి.అభిలాష్, డాక్టర్ సౌజన్య, లేడీ డాక్టర్ల రిప్రజెంటేటివ్‌గా డాక్టర్ బి.శ్రీలిఖిత ఎన్నికయ్యారు.

ఆశీలు సొమ్ము పక్కదారి

పర్యవేక్షణలోపమే ప్రధాన కారణం!


ఆదివారం వెంకపేటకు ఇటుక మెటీరియల్ తీసుకువచ్చిన వాహనం వద్ద ఆశీలు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి (వృత్తంలో)

జగదాంబ: పూర్ణామార్కెట్ ఆశీలు కొందరు ప్రైవేట్ వ్యక్తుల జేబులోకి వెళ్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ జోన్–4 పరిధి పూర్ణా మార్కెట్, రామకృష్ణ రైతుబజార్‌కు సంబంధించిన ఆశీలును గత ఏడాది నుంచి జోన్–4 కార్యాలయం సిబ్బంది శాఖాపరంగా (డిపార్టుమెంట్ కలెక్షన్) చేస్తున్నారు. ఇందుకు జీవీఎంసీ అధికారులు సెక్రటరీలు, జీవీఎంసీలో కింది స్థాయి సిబ్బందిని నియమించారు. అయితే కింది స్థాయిలో కొందరు ఉద్యోగులు ప్రైవేట్ వ్యక్తులతో చేతులు కలిపి ఆశీలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వసూలయ్యే నగదులో మొత్తం ఇవ్వకుండా సగం మాత్రమే ఇస్తూ జీవీఎంసీని మోసం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు కార్యాలయానికే పరిమితం కావడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు చెబుతున్నారు. ముఖ్యంగా మార్కెట్‌లో ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం వాహనాలు వస్తుంటాయి. వాటికి సంబంధించి ఆశీలును సిబ్బంది చేయాల్సి ఉన్నా వారు బయటి వ్యక్తులతో ఈ పనులు చేయిస్తుండడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ చేయాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా నడక పోటీలు


నడక పోటీల్లో పాల్గొన్న వాకర్స్


పోటీ పడుతున్న మహిళలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకర్ ఆదినారాయణ స్మారక నడక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ వీటిని ప్రారంభించారు. పోటీల్లో 102 మంది పాల్గొనగా.. వీరిలో 42 మంది మహిళలు ఉన్నారు. 31-40, 41-50, 51-60, 61-70, 71-80, 81-90 వయసుల వారీగా విభజించి మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు జరిపారు. ప్రతి విభాగం నుంచి మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేశారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందిస్తారు. ఈ పోటీల్లో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్, హెల్దీ వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్, మా వాకర్స్ క్లబ్, యూనివర్సల్ హెల్త్‌క్లబ్, ఇతర వాకర్స్ పాల్గొన్నారు. వీరికి ఉదయం ఫలహారాలు అందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆరిలోవ: యోగాతో ప్రతి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆనంద్‌మార్గ్ ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవధూత తెలిపారు. ముడసర్లోవ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఆదివారం ఉచిత యోగా శిబిరం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో వాకర్స్ క్లబ్ సభ్యులతో పాటు స్థానికులు వివిధ యోగాసనాలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా సౌమ్యానంద్ అవధూత మాట్లాడుతూ యోగాలో ఏ ఆసనం వల్ల ఎలాంటి ఉపయోగం కలుగుతుందో వివరించారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులు, పరిస్థితుల కారణంగా మనిషికి కలుగుతున్న ఒత్తిడి, అనారోగ్యం కుదుటపడడానికి యోగా సాధన మంచి ఔషధం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు మూర్తి, సభ్యులు ఈశ్వరరావు, వీర్రాజు, శంకరరావు, బాలరాజు, శ్రీను, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత మంత్రులు స్పందించాలి


బహిరంగ లేఖ విడుదల చేస్తున్న దళిత హక్కుల సమితి సభ్యులు

డాబాగార్డెన్స్: ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకం పునరుద్ధరణకు దళిత మంత్రులు స్పందించాలంటూ దళిత హక్కుల సంఘం రాష్ట్ర సమితి ఆదివారం డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బహిరంగ లేఖ విడుదల చేసింది. ఈ సందర్భంగా సమితి ఐక్యవేదిక కన్వీనర్ బూసి వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీల సంక్షేమ పథకాలు పునరుద్ధరణకు గత మూడేళ్లుగా దళిత హక్కుల సమితి ఐక్యవేదికతో పాటు రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నాయన్నారు. ముఖ్యమంత్రి క్యాంపు ఆఫీసులో సోమవారం నిర్వహించనున్న ఎస్సీ, ఎస్టీల సమీక్షా సమావేశంలో మంత్రులు కనీస బాధ్యతగా స్పందించి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సోడదాసి సుధాకర్, ఈతలపాక సుజాత, కస్తూరి వెంకట్రావు, కోల హరిబాబు, నూకరాజు, రాజేంద్ర ప్రసాద్, వెంకట నాంచారయ్య, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకం.. మంచి నేస్తం


పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: పుస్తకాన్ని మించిన నేస్తం మరొకటి ఉండదని విశాఖ జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. మనం తలదించుకొని పుస్తకాన్ని చదివితే మనల్ని తలెత్తుకుని జీవించే విధంగా ధైర్యాన్ని ఇస్తుందని చెప్పారు. ధన సంపద కన్నా.. జ్ఞాన సంపద గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఒక పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పి, వాటిని చదివించారు. పిల్లలకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.పద్మజ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు


చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


విద్యార్థులు వేసిన చిత్రాలు

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం బి.హేమలత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చక్కని చిత్రాలు వేశారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెద వీర్రాజు

సీతంపేట: కథకులు తమ చుట్టూ ఉన్న సమాజం నుంచి కథా వస్తువును తీసుకున్నంత కాలం తెలుగు కథలోని తెలుగుదనానికి కీడు వాటిల్లదని కవి, వైద్య నిపుణుడు ఈదర పెద వీర్రాజు అన్నారు. ఎన్.కె.బాబు సంపాదకత్వంలో 56 మంది రచయితల 56 కథల సంకలనం కథా పరిమళాలు పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి మరడాన సుబ్బారావు, ఎస్.హనుమంతరావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారి డి.శ్రీహరిరాజు, మేడా మస్తాన్‌రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, శిరేల సన్యాసిరావు, పరమేశ్వరరావు, చిన్ని రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థో వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 13వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆర్థోపెడిక్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. హెల్త్‌సిటీలో జీజే ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆరిలోవ కాలనీ, పాండురంగాపురం, ఆపరేషన్ కాలనీ, కనకమహాలక్ష్మినగర్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 100 మంది వృద్ధులు, మహిళలకు ఆర్థోపెడిక్ సమస్యలపై వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ కీళ్లు, ఎముకల నొప్పులతో బాధపడుతున్న వారు ఎలాంటి జాగ్రతలు తీసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి మేనేజర్ ఎల్.అరుణ్‌కుమార్, వైద్య సిబ్బంది, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పాండ్రంకి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ సౌత్
7997958342, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ సౌత్
9010196663
Office mail : sakshiadvtvsp@gmail.com